# రమణభాస్కర

## (మొగల్లులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 19-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు ఉపన్యాసములు ఏమీ చెప్పటంలేదు. ఊరక ఉంటున్నారు. సాధకులు సరియైన మార్గములో ప్రయాణం చేయటానికి మీరు ఏమీ చెప్పటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. నేను ఏమీ బోధించటం లేదని ఒక నిర్ణయానికి వచ్చి నీవు ఈ ప్రశ్న వేసావు. నేను ఎవరో నీకు తెలుసా? బోధించటం అంటే ఏమిటో నీకు అర్థమయ్యే ఈ ప్రశ్న అడుగుతున్నావా? నేను ఏమీ బోధించటంలేదు అని నీకు ఎలా తెలుసు? నా అభిప్రాయం నీకు చెప్పటానికి, నీ అభిప్రాయం నాకు చెప్పటానికి భాష అవసరం. భాషయొక్క ప్రయోజనం అది. మాటలతో చెప్పటమే బోధ అనుకొంటున్నావు. భోద అనేది మాటలు లేకుండా మౌనంద్వారాకూడా చెప్పవచ్చు. భాషతో పనిలేదు. సాధకుడు పక్వానికి వచ్చినపుడు మౌనబోధ అర్థమవుతుంది. గతజన్మలో సాధనచేసి ఈ జన్మలోనికి వచ్చినపుడు మౌనంద్వారా వచ్చే బోధ అందుకొంటారు. మాటలేకుండా మౌనంకూడా బోధిస్తుంది. మౌనంయొక్క బోధ అందుకోవటానికి కొంత పక్వత ఉండాలి. మౌనబోధ అందనపుడే మాటలతోపని. హృదయం హృదయంతో మాట్లాడుతూ ఉంటే మాటలతో పనిఏముంది. నేను ఇక్కడ ఒక గంట మాట్లాడతాను అనుకోండి. మీకు శాంతి కలగదు, మారు మనస్సు కలగదు అనుకోండి. ఇక్కడకు ఎలా వచ్చారో గంటసేపు ప్రసంగం తరువాత అలాగే వెళ్ళిపోతారు అనుకోండి. ఆ ఉపన్యాసములతోటి పని ఏమిటి అంటున్నారు. మీకు శాంతి కలగటం ముఖ్యమా? ఉపన్యాసములు ముఖ్యమా? మీలో మార్పు రావాలి. మౌనంద్వారా మీలో ఆమార్పు కలిగితే ఇంక ప్రసంగాలతో పని ఏముంది. కొంతమంది మహాత్ములదగ్గర కూర్చుంటే మనకు మారు మనస్సు వస్తుంది. వారి మాటలతో పనిలేదు. వారి ప్రభావంమనమీద పడుతుంది. మన జీవిత విధానం మారిపోతుంది. సత్యాన్వేషణ ప్రారంభించు అని వారు మనకు చెప్పకుండానే మనకు సత్యాన్వేషణపట్ల మక్కువ కలుగుతుంది. ఇది ముఖ్యమా లేక కొంతమంది ప్రసంగాలు చేస్తారు ఏమీ ప్రభావం కలుగదు. ఆ ప్రసంగాలు ముఖ్యమా?

అజ్ఞానంలో నుండి బయటకు రావాలని ఉందిఅని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. అజ్ఞానంలో ఉండిపోవచ్చును కదా ఎందుకు బయటకు రావాలని అనుకొంటున్నావు అని భగవాన్ అడిగారు. అజ్ఞానం వలన వాడికి బాధ వస్తోంది. అందువలన అజ్ఞానం నుండి బయట పడాలని చూస్తున్నాడు. ఈ జన్మలో కాకపోయినా, మరో జన్మలో అయినా అజ్ఞానంలో నుండి బయటకు రావాలి. ఎందుచేతనంటే అది యదార్థమైన స్థితికాదు, వాస్తవమైన స్థితికాదు. వాస్తవమైన స్థితి తెలియనంతకాలం ఏ పని చేసినా నేనే కర్తను అనుకొంటాడు, ఇదంతా నా వలననే అవుతోంది అనుకొంటాడు. నీ నిజస్థితి తెలిసే వరకూ కర్తృత్వంలో నుండి, భో క్తృత్వంలో నుండి నీవు బయటకు వచ్చే సమస్యే లేదు. ఇప్పుడు మనందరము నిజమైన స్థితిలో లేము. మౌనం అంటే నోరు మూసుకొని కూర్చోవటం కాదు. నిజమైన స్థితిలో ఉన్నవాడు మౌనంగా ఉండగలడు. ఎవడైతే తన హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకొన్నాడో వాడు మాత్రమే మౌనంగా ఉండగలడు. మనస్సు అణిగినచోట నిజమైన మౌనంవస్తుంది. కొంతమంది మౌనంగా ఉంటారు.

అంటే నిజస్థితిలో ఉంటారు. నిజస్థితిలో ఉండటంవలన వారి హృదయంలో నుండి శక్తి తరంగాలు, కాంతి తరంగాలు మీహృదయంలో ప్రవేశించి మోక్షం పొందాలి, ఇప్పుడే, ఇక్కడే ఈ జీవితంలోనే సాధన చేసి చైతన్యాన్ని పొందాలి అనే ప్రేరణ మీలోపల కలుగజేస్తాయి. మాటలు చెబుతారు. వినే వారి మీద ప్రభావం ఉండదు. అలాకాకుండా మౌనంగా కూర్చొని చడీ చప్పుడు లేకుండా ప్రక్కవాడికి తెలియకుండా ఎదుట వారి హృదయంలో మార్పు తీసుకొని వస్తారు. వీటిలో ఏది ముఖ్యం. మాట ముఖ్యమా? పని ముఖ్యమా? అని అడుగుతున్నారు.

దేవుడు కనిపిస్తున్నాడా, ప్రసంగాలు చేస్తున్నాడా, మాట్లాడుతున్నాడా ? లేదు. అయితే దేవుడు పనిచేయకుండా ఊరక కూర్చున్నాడా, లేదు. దేవుడు పని చేస్తున్నాడు. మనం కూడా ఆ స్థాయిలో పని చేస్తే మనం దేవుడు అయిపోతాము. నీవు ఏదైనా పని చేస్తే అందరికీ తెలిసి పోవాలి అనుకొంటావు. నీకు ఇతరులు ఉన్నారు. కాబట్టి నీవు చేసిన పని అందరికీ తెలియాలి అనుకొంటున్నావు. దేవుడికి ఇతరులు లేరు కాబట్టి ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకోడు. సర్వసాధారణంగా మానవుడు ఇతరుల గుర్తింపు కోసం పని చేస్తాడు. గుర్తింపు లేకపోతే చేసే పని మంచిది అయినా చేయడు. దేవుడు పని చేస్తున్నాడు. నీ లాగ అల్లరిగా చేయటంలేదు, నిశ్శబ్దంగా చేస్తున్నాడు. దేవుడు పని చేస్తున్నాడు అది నీకు తెలియకపోవచ్చు. అంత మాత్రం చేత దేవుడు పని చేయటం లేదు అనుకోవద్దు. నిశ్శబ్దం బంగారం లాంటిది. శబ్దం వెండి లాంటిది. నీకు బంగారం కావాలా ? వెండి కావాలా ?

మీకు జ్ఞానం కలిగింది అనుకోండి. ఇతరులకు సహాయం చేయాలి అని మీరు అనుకోనక్కరలేదు. మీ ద్వారా సహాయం అందుతూనే ఉంటుంది. వారి చైతన్యస్థాయి పెరుగుతూనే ఉంటుంది. జ్ఞాని ఉంటే చాలు అలా ఉండటం వలననే ఇతరులకు సత్ప్రవర్తన కలుగుతుంది. మంచి మార్గంలో ప్రయాణం చేయాలి అనే ప్రేరణ కలుగుతుంది. జ్ఞాని పని చేస్తున్నాడు అనుకోండి నేను పని చేస్తున్నాను అని వాడు అనుకోడు, అలా అనుకొనేవాడు అక్కడ లేడు. జ్ఞానం రాగానే ఈశ్వరుడు ఆ దేహాన్ని స్వాధీనం చేసుకొంటాడు. జ్ఞాని యొక్క దేహం దేవాలయంతో సమానము. ఇప్పుడు మన దేహం అహంకారం స్వాధీనంలో ఉంటుంది. జ్ఞానం కలిగితే దేహం ఈశ్వరుని స్వాధీనంలో ఉంటుంది. జ్ఞాని యొక్క దేహాన్ని ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. సందేశం ఈశ్వరుడిదే. ఈ దేహం ఉండవచ్చు, ఊడిపోవచ్చు. సందేశం యొక్క ప్రభావం, శాంతి యొక్క ప్రభావం మానవజాతి మీద ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

మౌనం చాలా శక్తి వంతమైనది. ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ఎంత వరకు మాట్లాడాలో అంత వరకే మాట్లాడాలి కాని ఎక్కువ మాట్లాడకూడదు. ఎక్కువగా మాట్లాడటం లగ్జరీ అన్నారు భగవాన్. అవసరం లేని మాటలు మాట్లాడటం లగ్జరీ. దాని వలన అహంకారం పెరుగుతుంది. మన హృదయంలో ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి మనకు ఉన్న పవిత్రత సరిపోవటం లేదు. అందువలన ఆ సద్వస్తువు తెలియబడటం లేదు. ఎవడైతే పరమ పవిత్రుడో వాడికి ఆ వస్తువు తెలియబడుతుంది. పరమేశ్వరుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. వాడిని నీవు శరణాగతి వేడుకొంటే నీవు పవిత్రుడవుతావు. శరణాగతి చెందితే నీకు మానసిక ఒత్తిడి, శారీరక ఒత్తిడి తగ్గిపోతాయి. ఈ దేహం మీ మనస్సుదే కాబట్టి మనస్సులో వచ్చే ప్రతీ వికారము దేహం మీద పడుతుంది. ధ్యానం చేయటం వలన ఏకాగ్రత కలుగుతుంది. ఏకాగ్రత కలగటం వలన మౌనస్థితికి చేరుకొంటావు. మౌనస్థితి అంటే నోరు మూసుకోవటం కాదు. మౌనస్థితి అంటే ఆత్మస్థితి. నీ నిజస్థితి నీవు పొందినపుడు, నీవు ఎవరో నీకు తెలిసినపుడు నీకు ఇష్టం ఉన్నా, లేక పోయినా నీ ద్వారా లోకానికి మేలు జరుగుతుంది.

నీ హృదయంలో ఉన్న వస్తువు ఎప్పుడైతే అనుభవంలోకి వచ్చిందో అప్పుడు ఇంక సాధన చేయటానికి మనస్సు మిగలదు. మిమ్మల్ని ఎప్పుడూ ఇలాగ బాధ పెడతాను అని అనుకోవద్దు. కొంతకాలం మీరు ప్రయత్నం చేస్తే గురువు అనుగ్రహం వలన ప్రయత్నం లేని స్థితికి మీరు ఎదికి వెళ్ళిపోతారు. మనస్సు ఉన్నప్పుడు కొంత ప్రయత్నం చేయండి. నెమ్మదిగా, జాగ్రత్తగా చేయండి. దేవుని అనుగ్రహంవలన మనస్సు లేని స్థితికి, ప్రయత్నరహితమైన స్థితికి, ఎదిగి వెళ్ళిపోతారు. సూర్యుడు చీకటిని చూడాలి అనుకొన్నా చూడలేడు. సూర్యుడు ఎక్కడకు వెళితే, అక్కడకు వెలుగు వచ్చేస్తుంది. అలాగే నీవు మౌనం యొక్క లోయలలోనికి ప్రవేశించినపుడు ఒక వేళ నిగ్రహించుకుందామని అనుకున్నా అక్కడ నీ మనస్సు ఉండదు. బ్రహ్మానుభవం కలిగినపుడు నీకు నిగ్రహించుకోవటానికి మనస్సు ఉండదు. సందేహం వద్దు. భగవంతుని మీద పూర్తి విశ్వాసం ఉంటే మనకు "టెన్షన్‌లు " తగ్గిపోతాయి. ఎందుకు అనేక సందేహాలు రేపు కొంటారు భగవంతుని మీద భారం వేయటం నేర్చుకొండి అని గణపతి శాస్త్రిగారితో భగవాన్ అనేవారు. భగవంతుని మీద భారం వేయటం నేర్చుకొంటే మనకు జ్ఞానం కలుగుతుంది. మన సంకల్పం వలన పని అవుతోంది అనుకొంటున్నాము. మన సంకల్పం లేకపోతే పని అవ్వదు అనుకుంటున్నాము. మన కళ్ళకు కనబడని శక్తి, ఒకటి ఉంది. ఈ సృష్టిలో అనేక రహస్యాలు ఉన్నాయి. మన మెదడు చాలా చిన్నది ఎన్ని అర్థం చేసుకోగలదు. గత జన్మలో ఎక్కడ ఉన్నామో తెలియదు, రాబోయే జన్మ ఎక్కడో తెలియదు. ఏ పని ఎందుకు అవుతుందో, ఏ పని ఎందుకు ఆగుతోందో మనకు తెలియదు. ఇదంతా సృష్టి నిర్మాత చూసుకొంటాడు. నీ బుర్రను పాడు చేసుకొనేబదులు ఏ శక్తి అయితే పని చేసి పెడుతోందో ఆ శక్తికి శరణాగతిచెందితే, నేను చెయ్యాలి అని అనుకోకుండానే ఆ పని సహజంగా జరుగుతుంది, నీకు శాంతి కలుగుతుంది.

మనస్సును పట్టించుకోవద్దు. ఎందుచేతనంటే మనస్సులో ఏమి జరుగుతున్నప్పటికీ అది నువ్వుకాదు. నా మనస్సు బాగాలేదు అని చాలా మంది చెబుతారు. నీ మనస్సు బాగాలేదు అనుకో నీకు నష్టం ఏమిటి అది నువ్వు కాదు కదా. అది నువ్వు కానపుడు దాని గొడవ నీకు ఎందుకు. మనస్సువు నీవుకాదు కాబట్టి గాఢనిద్రలో నీవు మనస్సు నుండి వేరుపడి పోతున్నావు. గాఢనిద్రలో ఎవరికీ మనస్సు గొడవలేదు. మనస్సు దాని ఇంటికి అది వెళ్ళే వరకూ అల్లరి చేస్తూనే ఉంటుంది. దాని ఇల్లు హృదయం. మనస్సును దాని ఇంటికి పంపటమే మనం చేయవలసినపని. మాటల వలన వచ్చే సందేశం కంటే మౌనం ద్వారా వచ్చే సందేశం చాలా బలంగా ఉంటుంది. మాటల ద్వారా వచ్చే సందేశం ఆగిపోతుంది. ఎంతసేపు చెపుతారు. కొద్ది సేపు అయిన తరువాత ఆగిపోతుంది. కాని మౌనం ఇచ్చే సందేశానికి ముగింపులేదు. మీరు ఇంటికి వెళ్ళినా అది మిమ్మలను తరుముతుంది. ప్రతీ నిమిషం అది మీ మీద పని చేస్తుంది. మౌనం యొక్క సందేశం ఎంతబలంగా ఉంటుంది, అంటే ఏ టీచర్ లో నుండి ఆ టీచింగ్ వస్తోందో ఆ టీచర్‌ను గాని, ఆ టీచింగ్‌ను గాని, విడిచిపెట్టి మీరు ఎక్కడకీ తప్పించుకోలేరు. అందువలన మా ఊరు రండి, ఉపన్యాసాలు చెప్పండి అని అడుగనక్కరలేదు. గురువు అనుగ్రహం ఎంత వేగంగా వస్తుంది అంటే అనుగ్రహం వచ్చి నిన్ను తాకినపుడు నీకు ఊపిరి సలపదు. దానికి ముగింపు లేదు. ఉపన్యాసములకు ఏముంది, గురువు యొక్క హృదయం నుండి వచ్చే మౌన సందేశం ఈ జన్మలోనే కాదు, వచ్చే జన్మలో కూడా మిమ్మల్ని వెంటాడుతుంది. మీరు ఎవరో మీకు తెలిసే వరకూ ఆ సందేశం మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. మీ హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చే వరకూ మీరు ఏ దేహంలో ఉన్నప్పటికీ మీ లోపల ఉన్న సత్యమే ఏదో గురురూపంలో వచ్చి మిమ్మల్ని దొర్లించుకొంటూపోతూ ఉంటుంది. ఇన్ని జన్మలలోనూ, ఆ వస్తువు నాదగ్గరే ఉంది. నా దగ్గరే ఉన్నప్పటికీ నాకు తెలియక పోవటం వలన బయట

గురురూపం ధరించి నన్ను తరుము కొంటూ వస్తోంది అని ఆ వస్తువు తెలిసాక నీకు తెలుస్తుంది.

నువ్వు ఎక్కడ ఉన్నా, ఏ కుటుంబంలో జన్మించినప్పటికీ గురువు ఎడ్రసు నీకు తెలియక పోయినా, గురువుకి నీ ఎడ్రసు తెలుస్తూఉంటుంది. నిన్ను వెంటాడుతూ ఉంటాడు. నోటితో చెప్పే మాటలు హృదయంలో నుండి వచ్చే సందేశాన్ని ఆపుచేస్తాయి. మీరు ఏదైనా సాధించాలన్నా, మాటల కంటే మౌనంలో నే సాధించగలరు. ఈ లోకంలోని విషయాలను స్మరించటం కంటే దేవుని ప్రార్థించటం వలన మీరు ఎక్కువ సాధించ గలరు. అప్పుడు హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. నీలో అల్పత్వం, స్వల్పత్వం ఉంటే నశిస్తాయి. ఉపన్యాసములు ఇక్కడ ఉన్న వారికి వినబడతాయి, వారి మీద పనిచేయవచ్చు. కాని మౌనం ద్వారా వచ్చే సందేశం ఎక్కడ ఉన్నా ఏ దేశంలో ఉన్నా ఖండాంతరంలో ఉన్నవాడు అయినా సత్యాన్వేషకుడు అయితే వాడికి ఆ సందేశం అందుతుంది. దాని ప్రభావం వాడి మీద ఉంటుంది. మౌనం నుండి వచ్చే సందేశం ఎంత బలంగా ఉంటుంది అంటే కాలంగాని దూరంగాని దానిని ఆపుచేయలేవు. మాటలు ఈ మైకు ఎంత వరకు వినబడితే అంతవరకే కాని మౌన సందేశం కాలంతో, దూరంతో సంబంధం లేకుండా నీ చావుతో సంబంధం లేకుండా నీవు క్రొత్త దేహంలోనికి వెళ్ళినప్పటికీ అత్యంతవేగంగా, అత్యంతబలంగా వచ్చి నీ హృదయాన్ని తాకుతుంది. మౌనసందేశమును నీవు పట్టుకోగలిగితే ఈ మాటలు ఏమీ ఉపయోగపడవు. కొన్ని కొన్ని మాటలు నీ అభివృద్ధియొక్క వేగాన్ని ఆపుచేస్తాయి.

భగవాన్ ఎక్కడికి తిరగలేదు. ప్రపంచం అంతా ఆయన దగ్గరకు వచ్చింది. ఆయన మౌనం యొక్క ప్రభావం, ఆయన అనుగ్రహం ప్రవాహంలాగ వ్యాపించి ప్రపంచాన్ని అంతా తడిపింది. అనుగ్రహం యొక్క శక్తి అటువంటిది. మాటలకే శక్తి ఉంది అని అనుకోవద్దు. గురువు దగ్గర నుండి వచ్చే అనుగ్రహబలంతోటి మీ బలహీనతలతో పోరాడండి. మీ బలహీనతలు బయటకు పోయేవరకు అనుగ్రహం మిమ్మల్ని విడిచి పెట్టదు. మిమ్మల్ని పవిత్రులను చేసేవరకూ అది విడిచి పెట్టదు. ప్రతి జన్మలో గురువు నీకూడా వస్తాడు. నీకు కనబడడు. నిన్ను పక్వం చేయటానికి ప్రయత్నం చేస్తూఉంటాడు. టైము వచ్చినపుడు సడన్‌గా నీ మనస్సును హృదయంలో లయింప జేస్తాడు. ఇదంతా నీకు చెప్పి చేయడు. సైలెంట్‌గా చేసేస్తాడు. వాడు చేసే పని నీకు తెలియాలి అని గురువు అనుకోడు. నీ గుర్తింపు వాడికి అక్కరలేదు. వర్షం వచ్చినపుడు బిందెను బోర్లిస్తే బిందె నిండదు. **open** చేస్తే అది నిండుతుంది. అలాగే నీ హృదయాన్ని **open** చేస్తే గురువు అనుగ్రహంతో అది నిండిపోతుంది. నీ హృదయాన్ని మూసుకుంటే ఏమీ లేదు. వారి సమక్షంలో ఉన్నంతమాత్రంచేత మాటలతో పనిలేదు. నీకు సాధన చేయాలనే బుద్ధి వస్తుంది. ఇంతకు ముందే సాధన చేయాలనే బుద్ధి ఉంటే నీ బుద్ధి శుద్ధి అయిపోతుంది. అడిగినవారికి అడిగినదే ఇస్తాడు. అడగని వారికి అన్నీ ఇస్తాడు. అది అరుణాచల క్షేత్రం యొక్క వైభవం. మౌనం చాలా శక్తివంతమైనది. నీ మాటలతో, ఆలోచనలతో, గుర్తింపుతో, ప్రారబ్దంతో సంబంధం లేకుండా అత్యంతవేగముగా వచ్చి అది నీ మీద పనిచేస్తుంది. నీలో ఎంత బలమైన వాసనలు ఉన్నప్పటికీ ఆ ప్రవాహవేగము వాటిని గెంటివేస్తుంది. ఏ శక్తి అయితే ఈ సృష్టిని నడుపుతుందో ఆ శక్తికి శరణాగతి చెందితే అదే నీకు మోక్షాన్ని శాశ్వత స్థానమును కలుగజేస్తుంది. శక్తి నీకు లేదు. శక్తి ఈశ్వరుడిది. నీవు ఏ పని చేస్తున్నప్పటికీ ఈశ్వరుడిని శరణువేడుకొంటే నిన్ను నిమిత్తమాత్రంగా, బొమ్మగా పెట్టుకొని ఆపని ఆయనే పూర్తిచేస్తాడు. భగవంతుని అనుగ్రహంలేదు అని అనుకోవద్దు. అనుగ్రహం ఉంది. దానిని గుర్తించే శక్తి నాకు లేదు అనుకోండి.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-12-96)**